మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# మహిళా అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

**• వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**పెబ్బేరు, మే 31 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోనీ మహిళల అభ్యున్నతే పరమావధిగా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సహారా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయనతో పాటు జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మొదటి సంతకం ఆర్టిసి బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం పైన సంతకం చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. వనపర్తి నియోజకవర్గం సంబంధించి ఇప్పటివరకు రూ.30 కోట్ల 29 లక్షలు ప్రభుత్వం ఆర్టీసీ కార్పొరేషన్ చెల్లించిందని ఆయన తెలిపారు. రేషన్ కార్డులు లేక అవస్థలు ఎదుర్కొంటున్న ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి రేషన్ కార్డులు అందజేస్తుందని చెప్పారు.నియోజకవర్గంలో 37,500 కొత్త దేశం కార్డులను అందజేసినట్లు ఆయన వివరించారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలను మహిళా మణులు ఏ ఒక్కరూ ధరించలేదని కేవలం అవివ్యవసాయ పొలాల చుట్టూ పందులు రాకుండా కట్టేందుకు మాత్రమే ఉపయోగ పడ్డాయని ఎద్దేవా చేశారు. నేడు పంపిణీ చేసిన ఇందిరమ్మ చీరలు నాణ్యవంతంగా ఉండడంతో మహిళలుసంతోషంగా ధరిస్తున్నారని అనిచెప్పారు. రూ.200లు ఉచిత కరెంటు ఇచ్చి నిరుపేద లకు కరెంటు కష్టాలు ప్రభుత్వం దూరం చేసిందని గుర్తు చేశారు. అదేవిధంగా మహిళలకు వడ్డీ లేని రుణాలు అమ్మ ఆదర్శ పాఠశాలలకు చైర్మన్లుగా ఆర్టీసీ బస్సులకు ఓనర్లుగా సోలార్ ప్లాంట్లకు ఓనర్లుగా ఎన్నో రకాలుగా మహిళలను చైతన్యవంతం చేసేందుకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆయన పూర్తి చేశారు. వాళ్లున్న రోజుల్లో సూపర్ మార్కెట్లు రైస్ మిల్లులు గోదాముల సైతం నిర్వహణ బాధ్యతలను మహిళల కప్పజెప్పుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను విపక్షాలు కల్లుండి చూడలేని కబోదిలుగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. సంక్షేమ ఫలాలతోనే ప్రభుత్వం వారికి బుద్ధి చెబుతుందని చెప్పారు. పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, స్థానిక కౌన్సిలర్లు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోద్ రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మయూరి పార్కులో ప్లాస్టిక్ నిషేధం

- మీ టికెట్ యాప్ ద్వారా ఆన్‌లైన్ సేవలు
- డీఎఫ్‌ఓ శివ ఆశిష్ సింగ్
- ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ

**మహబూబ్‌నగర్, మే 31, ప్రభాతవార్త:** మయూరి ఎకో పార్క్‌ను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎఫ్ఓ శివ ఆశిష్ సింగ్ తెలిపారు. ఈ మేరకు మయూరి ఎకో పార్క్ పరిసర ప్రాంతాలలో విస్తృత స్థాయిలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్క్ సిబ్బంది పరిసర ప్రాంతాలలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించే కార్యక్రమం సక్రమంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మయూరి ఎకో పార్క్‌లో ఎటువంటి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను అనుమతించబోమని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ



ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న సిబ్బంది



ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించిన సిబ్బంది

దృష్ట్యా ఈ నిబంధనలను కఠినంగా అమలు చేస్తామని, వాటిని ఉల్లంఘించే వ్యక్తులపై సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సందర్శకులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు మయూరి ఎకోపార్క్‌లో డిజిటల్ టికెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సందర్శకులు మీ టికెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పార్క్ ప్రవేశ టికెట్లు, ఇతర అందుబాటులో ఉన్న టికెట్లను ఆన్‌లైన్ ద్వారా సులభంగా బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహితపార్క్ నిర్మాణంలో ప్రతి సందర్శకుడు భాగస్వామి కావాలని, పరిశుభ్రమైన, హరిత వాతావరణ పరిరక్షణకుసహకరించాలనిఅధికారులువిజ్ఞప్తి చేశారు.

## చీటింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**• నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట, మే 31 ప్రభాతవార్త:** ప్రస్తుత సమాజంలో వివిధ రూపాల్లో జరుగుతున్న చీటింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డా వినీత్ సూచించారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసు కుని కొందరు వ్యక్తులు ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బంగారం, స్థలాలు, ఆన్‌లైన్ వ్యాపారాలు, లక్కీ డ్రాలు, విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ పెట్టు బడితో అధిక లాభాలు, సులభంగా రుణాలు, తక్షణ ఉద్యోగాలు, లాటరీ గెలుపు వంటి ఆశాజనక మాటలతో ప్రజలనునమ్మబలికి డబ్బులు వసూలుచేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, ఫోన్‌కాల్స్,సందేశాలను నమ్మి ఎవరూ మోసపోవద్దని హెచ్చరించారు. ఇటీవల కొందరు నకిలీ పత్రాలు, ఫేక్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు చూపించి స్థలాలు, ఇళ్ల అమ్ముతున్నట్లు నటిస్తూ మోసాలకు పాల్పడు తున్నారని తెలిపారు. ఆస్తుల కొనుగోలు సమయంలో సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించి, అధికారిక ధృవీ కరణ పొందిన తర్వాతే లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని డబ్బులు అడగడం, ఫేక్ అకౌంట్లతో మోసాలు చేయడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయమని చెప్పి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దోచుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు.అపరిచితులపై నమ్మకం ఉంచి ఆర్థిక లావాదేవీలు చేయవద్దని సూచించారు. ఉద్యోగాల కోసం ప్రయత్నించే విద్యార్థులు, యువత ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలను మాత్రమే సంప్రదించాలని,ముందస్తుగా డబ్బులు డిమాండ్ చేసే సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మహిళలు బంగారం కొనుగోళ్లు, చిట్ ఫండ్లు, ఆన్‌లైన్ షాపింగ్ వంటి విషయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించినా లేదా మోసాలకు గురైనా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. చీటింగ్ కేసులపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని, మోసగాళ్లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల అప్రమత్తతే మోసాలకు అడ్డుకట్ట వేయగలదని, తక్కువసమయంలో ఎక్కువలాభాలు వస్తాయనే ఆశతో తెలియని వ్యక్తులకు డబ్బులు లేదా వ్యక్తిగత వివరాలు ఇవ్వవద్దని, అనుమానం వచ్చిన వెంటనేపోలీసులను సంప్రదించాలని జిల్లా ఎస్పీ డా. వినీత్ పేర్కొన్నారు.

## కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి పట్టు గొమ్మలు

- బూత్ కమిటీల్లో గ్రామ కమిటీలు, మండల అధ్యక్షులు క్రియాశీలకమైన బాధ్యత
- గ్రామ అధ్యక్షులే గ్రామాస్థాయిలో ప్రప్రథమం
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి



**వనపర్తి, మే31, ప్రభాతవార్త:** సంస్థాగత బలోపేతానికి, నాయకత్వ సామర్థ్యాల పెంపు, బూతు స్థాయి నుండి పార్టీని ప్రతిష్ట చేయడమే జిల్లా మండల కమిటీ ఎజెండా అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన అధ్యక్ష, కార్యదర్శుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి శివసేనరెడ్డి హాజరై, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డిమాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం ఐక్యతగా పనిచేద్దాం అని పిలుపునిచ్చారు. గతంలో ఉన్న మండల కమిటీలకు , ప్రస్తుత నూతనంగా ఎన్నుకున్న మండల కమిటీలకు వ్యత్యాసాలు చాలా ఉంటాయని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో వెళ్లాలని, సంస్థాగత , గ్రామ కమిటీలు, బూత్ కమిటీల్లో కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. పార్టీకి నిబద్ధతగా పనిచేసే వారికే మొదటి ప్రాధాన్యత ఉంటుందని, కొత్తగా ఎన్నుకున్న మండల అధ్యక్షులు కార్యవర్గానికి కీలకంగా బాధ్యతతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అంతకు ముందు కొత్తగా నియమించిన పట్టణ మండల కమిటీ సభ్యులను సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, కొత్తగా ఎన్నికైన పట్టణ, మండల అధ్యక్షులు పలువురు పాల్గొన్నారు.



నూతన అధ్యక్ష కార్యదర్శులతో సమావేశమైన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శివసేనారెడ్డి

### డ్రైనేజ్ సమస్యను పరిష్కరించండి..

- ఏండ్లు గడుస్తున్నా పరిష్కారం శూన్యం
- వర్షాకాలం వచ్చిందంటే భయాందోళన
- 23వ వార్డు ప్రజల అవస్థలు

3



## ఉపాధి కూలీ మృతి

• ఎండ తీవ్రతకు తట్టుకోలేకే.. • పని ప్రదేశంలో సౌకర్యాలు శూన్యం



మృతి చెందిన ఉపాధి కూలీ సంధ్య ( ఫైల్)

**వంగూరు, మే 31 ప్రభాతవార్త:** ఉపాధి హామీ పని నిర్వహిస్తున్న ప్రదేశంలో కూలీలకు ఎండ తీవ్రతను తట్టుకునేందుకు టెంట్లు, దప్పిక తీర్చుకునేందుకు మంచినీళ్లు,ఎండాకాలంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కోసం వైద్య కిట్టు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఉపాధి కూలీలచే పనులు నిర్వహిస్తున్న వైనం వంగూరు మండలంలో చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యానికి జానెడు పొట్టను నింపుకునేందుకు పనికోసం వెళ్లిన ఉపాధి కూలీ ఎండ తీవ్రతను తట్టుకోలేక వడదెబ్బతో మృతి చెందిన సంఘటన వంగూరు మండలం పోల్కంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే శనివారం మధ్యాహ్నం ఉపాధి హామీ పనికి వెళ్లిన ఎంకు సంధ్య ఎండ తీవ్రత వల్ల కళ్ళు తిరిగి పడిపోయింది. అక్కడ నుంచి ఇంటికి వచ్చిన సంధ్య వడ దెబ్బతో చాలా ఇబ్బంది పడుతుంటే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తిలోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు అదే రాత్రి 8 గంటల సమయంలో సంధ్య(32)మృతి జరిగిందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. అప్పటివరకు అందరితో కలిసి మాట ముచ్చట పెడుతూ ఒక్కసారిగా ఎండ తీవ్రతకు తట్టుకోలేక ఇబ్బంది పడుతూ సంధ్య మృతి చెందడం తోటి కూలీలను కంటతడి పెట్టించింది. ఉపాధి కూలి పనికి వెళ్లి ఎండ తీవ్రత తట్టుకోలేక సంధ్య మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. మృతురాలికి భర్త పిల్లలు ఉన్నారు.

## సీఎం పర్యటనకు కరివెన వద్ద సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్,మే 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పాలమూరు ప్రాజెక్టుల సందర్శనకు ఈ నెల 4,5 తేదీలలో రెండ్రోజులుమహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్నారు. ఐదవ తేది భూత్పూర్ మండలం కరివెన వద్ద నిర్మిస్తున్న శ్రీకురుమూర్తిరాయ (పాలమూరు-రంగారెడ్డి)ప్రాజెక్టును సందర్శించనున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి ప్రాజెక్టు సీఈలు సత్యనారాయణరెడ్డి,విజయభాస్కర్‌రెడ్డిలతో కలసి కరివెన ప్రాజెక్టును సందర్శించారు.ప్రాజెక్టుకు సంబంధించి అధికారులు,ఇంజినీర్లతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించే సమీక్షా సమావేశం స్థలంతో పాటు సీఎం హెలికాప్టర్ దిగేస్థలాన్ని ఎమ్మెల్యేజీఎంఆర్ పరిశీలించారు. సీఎంతో పాటు రాష్ట్ర ఇరిగేషన్‌శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి,జిల్లాకు చెందిన మంత్రులు జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు పాల్గొంటారని ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు. సీఎం రాకతోపాలమూరు ఉమ్మడిజిల్లాల ప్రాజెక్టులకు మహర్ధశ రానుందని ఎమ్మెల్యే జీఎంఆర్ తన ఆశాభావం వ్యక్తం చేశారు.



కరివెన ప్రాజెక్టు వద్ద సీఎం పర్యటనకు సంబంధించి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

# ప్రజలకు సత్వర సేవలందించాలి

- నిస్పక్షపాత విధులు నిర్వర్తించాలి
- మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి
- హన్వాడ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు

**హన్వాడ, మే 31 ప్రభాతవార్త:** పారదర్శకంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సత్వర సేవలు అందించాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ పోలీసు అధికారులకు సిబ్బందిని ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.జానకి ఆదివారం సందర్శించి వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, ఎఫ్ఐఆర్ నమోదు విధానం, స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసులు, రౌడీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్ నమోదువిధానం,ఆన్‌లైన్ అప్డేట్స్ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు.ప్రతి కేసునుసమయానుకూలంగా నమోదు చేసి సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యత పెంపొందించడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఫిర్యాదుల స్వీకరణ నుంచి కేసులదర్యాప్తు వరకు ప్రతిదశలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని స్పష్టం చేశారు.రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్ ఇచ్చిన ఆదేశాలను జిల్లా ఎస్పీ సిబ్బందికి వివరించారు.నిస్పక్షపాత విధులే పోలీసుల ప్రధాన లక్ష్యమని, ప్రజలవిశ్వాసాన్ని పెంపొందించేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీజీపీ సూచించినట్లు తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.అలాగే పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ,సిబ్బంది క్రమశిక్షణ వంటి అంశాలను కూడా జిల్లా ఎస్పీ పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుదారుతో మర్యాదగా మాట్లాడా లని, వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సిబ్బందికి సూచించారు.పోలీస్ సిబ్బంది ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.హెల్మెట్ ధరించడం ద్వారా రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం తగ్గుతుందని తెలిపారు. పోలీస్ సిబ్బందే ప్రజలకు ఆదర్శంగా ఉండాలని పేర్కొంటూ, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై వచ్చే సిబ్బందిని పోలీస్ స్టేషన్‌లోకి అనుమతించవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అనంతరం స్టేషన్ సిబ్బందితో జిల్లాఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించి వారిసమస్యలు, వ్యక్తిగతఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత సమస్యలు ఉన్న సిబ్బంది ప్రతి శనివారంజిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చినేరుగా తనను కలవవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, డిసిఆర్బి డి.ఎస్.పి రమణా, రూరల్ సీఐ గాంధీనాయక్, హన్వాడ సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులకు ఆదేశాలు ఇస్తున్న ఎస్పీ జానకి



పోలీస్ స్టేషన్లో వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తాం

**• ఆత్మీయ సమ్మేళనంలో పలువురి వెల్లడి**

**ఆత్మకూర్ మే 31,ప్రభాతవార్త;** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తిరిగి పూర్వ వైభవం తెచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామని కళాశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు వెల్లడించారు. ఆదివారం రోజు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 1985.87.విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన విద్యార్థిని విద్యార్థులు దాదాపు 40 సంవత్సరాలకు ఆత్మీయ సమ్మే ళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించి ప్రస్తుతం పంజాబ్, చండీగఢ్ రాష్ట్రాలకు బిజెపి పార్టీకి సంఘటన కార్యదర్శిగా పనిచేస్తున్నటువంటి అమరచింత వాసి మంత్రి శ్రీనివాసులు, అమరచింతపట్టణానికే చెందిన గోషామహల్ ఏసీపీగా పనిచేస్తున్న సుదర్శన్, అడిషనల్ కలెక్టర్‌గా పని చేస్తున్నటువంటి జగదీశ్వర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ తాము చదువుకున్న కళాశాలకు పూర్వవైభవం తెచ్చేందుకు తమ వంతు సహకారం అందించడమే కాకుండా ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా తోడ్పాటు అందించేందుకు ఎల్లవేళలా ముందు ఉంటామని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం వివిధ హోదాల్లో పని చేస్తున్నటువంటి వారు కళాశాల అభివృద్ధి పరిచేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఈ విషయంపై త్వరలోనే మరోసారి సమావేశమై చర్చించేందుకు అవకాశం కల్పించా లని పలువురు విజ్ఞప్తి చేశారు. దాదాపు 40 సంవత్సరాల తర్వాత కలుసు కున్న పూర్వ విద్యార్థులు ఆదివారంరోజు తాముకు విద్యను బోధించిన అధ్యా పకులను సన్మానించడమే కాకుండా పాదాభివందనం చేయడం పలువు రిని విశేషంగా ఆకర్షించింది. సమావేశంలో పలువురు మాట్లాడుతూ తమ వంతు సహకారం అందిస్తామని చెప్పినప్పటికీ స్పష్టంగా తాను వ్యక్తిగతంగా కళాశాలకు సహాయం చేస్తానని ఎవరూ కూడా ప్రకటించకపోవడం పట్ల పట్టణానికి చెందిన పలువురువిచారం వ్యక్తం చేశారు. ఏది ఏమైనప్పటికీ 40 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు కలిసి ఆటపాటలతో ఆలరించి కళాశాలలో సందడి చేశారు.



గురువులను సన్మానిస్తున్న పంజాబ్, చండీగఢ్ బిజెపి సంఘటన కార్యదర్శి మంత్రి శ్రీనివాస్ , గోషామహల్ ఏసిపి సుదర్శన్



శిధిలావస్థకు చేరుకున్న ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

## జయశంకర్ భూపాలపల్లిలో జెండా ఎగరవేయనున్న విప్ యెన్నం

**రాష్ట్ర అవతరణ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు..**



**మహబూబ్ నగర్, మే 31 ప్రభాతవార్త :** జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్వహించే అధికారిక కార్యక్రమంలో ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి జాతీయ జెండానుఆవిష్కరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుండగా, జిల్లాలో జరిగే ప్రధాన కార్యక్రమానికి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

## మహబూబ్‌నగర్ డీఈఓగా విజయకుమారి

**- నేడు పదవీ బాధ్యతలు స్వీకరించనున్న నూతన డీఈఓ**



విజయకుమారి, మహబూబ్‌నగర్ జిల్లా నూతన విద్యాశాఖాధికారిణి

**మహబూబ్‌నగర్, మే 31, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా నూతన విద్యాశాఖాకారిణిగా మేడ్చల్‌లో డీఈఓగా పనిచేసిన విజయకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు విజయకుమారిని మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖాధికారిణిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. నూతనంగా మహబూబ్‌నగర్ డీఈఓగా నియమితులైన విజయకుమారి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని తెలు స్తోంది. ఇక్కడ డీఈఓగా పని చేసిన ప్రవీణ్‌కుమార్ గత కొంతకాలంగా దీర్ఘకాలిక సెలువులపై వెళ్లడం,ఇట్టి సెలవులు మే 30తో ముగియ డంతో ప్రభుత్వం ప్రవీణ్‌కుమార్ స్థానంలో మేడ్చల్ డీఈఓగా పని చేస్తున్న విజయకుమారిని మహబూబ్‌నగర్ నూతన డీఈఓగా నియ మిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు నూతన డీఈఓగా నియమి తులైన విజయకుమారిని జిల్లా ట్రస్మా స్వాగతించింది. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బత్తులలక్ష్మణ్,మహబూబ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు వంశీ మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతికుమార్, మీడియా కన్వీనర్ గొడుగు వెంకటయ్యలు వేర్వేరు ప్రకటనల్లో స్వాగతించారు.

## ఉత్సాహంగా హ్యాపీ సండే

**• ఆకట్టుకున్న నృత్యాలు, విన్యాసాలు**

**మహబూబ్‌నగర్, మే31, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం "హ్యాపీ సండేస్ " కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. మహబూబ్ నగర్ స్టేడియం కమాన్ కొత్త బస్టాండ్ ప్రధాన రోడ్డు కూడలి వద్ద మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక /డాన్స్ కార్యక్రమాలు, మ్యాజిక్ షో, యోగ ఆసనాలు, మిమిక్రీ షో, సీనియర్ సిటిజన్లో డాన్స్ షో, కరాటే చేతులు మీద నుండి కారు పోనివ్వటం,మరి కళ్ళకు గంతలుగట్టి బైక్ నడపడం లాంటి విన్యాసాలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్ర మంలో స్వయం సంఘాల సభ్యులద్వారా స్టాళ్లను ఏర్పాటు చేసి వారు తయారుచేసిన పౌష్టికఆహార పదార్థాలను,ఇతర వస్తువులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## ఆస్తి కోసం తండ్రిపై కట్టుకున్న భార్య, కొడుకుల దాష్టీకం

### ప్రాణభయంతో పోలీసులను ఆశ్రయించిన బాధితుడు


గాయాల పాలైన కృష్ణయ్య

**నవాబుపేట,మే 31 ప్రభాతవార్త :** ఆస్తి కోసం కట్టుకున్న భార్య కొడుకులు ఇంట్లోకి చొరబడి బంధించి మూకుమ్మడిగా దాడి చేస్తే వారి వేధింపులు తట్టుకోలేక బాధితుడు పోలీసులను ఆశ్రయించిన ఘటన మండల పరిధిలోని కొండాపూర్‌లో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కొండాపూర్ గ్రామానికి చెందిన పోకల కృష్ణయ్య (75), భార్య పోకల సరస్వతమ్మ, కొడుకు లక్ష్మణ్ కుమార్‌లు ఆస్తి విషయంలో గత మూడు సంవత్సరాల నుండి తమపై దాడికి పాల్పడుతూ మానసికంగా వేధిస్తూ ఉన్న ఆస్తి మొత్తం తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని, ఒత్తిడి తెస్తూ దానికి ససేమిరా అనడంతో భార్య, కొడుకులు ఇద్దరు తనపై పలుమార్లు దాడికి పాల్పడ్డారని శనివారం ఇంట్లోకి వచ్చి భార్య సరస్వ తమ్మ కొడుకు లక్ష్మణ్ కుమార్ మూకుమ్మడిగా ఇంట్లో బంధించి కొడుకు బెల్టుతో కొడుతూ పిడి గుద్దులు గుద్దుతూ హింసించి కిందపడేసి అమానుషంగా క్రూరంగా దాడి చేస్తే వారి నుండి తప్పించుకొని ప్రాణభయంతో నవాబుపేట పోలీసులను ఆశ్రయించాడు. ఇదివరకే ఉన్న భూమి ఆస్తి 4 ఎకరాల తోటను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఇప్పుడున్న కాస్త రెండు ఎకరాల భూమి ఇంటి కోసం నాపై అమానుషంగా గత మూడు సంవత్సరాల నుండి భయభ్రాంతులకు గురిచేస్తూ దాడి చేస్తున్నారని తనకు తన భార్య సరస్వతమ్మ కొడుకు లక్ష్మణ్ కుమార్‌ల నుండి ప్రాణభ యం ఉందని ఎప్పటికైనా నన్ను చంపేస్తారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసు లు కేసును పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## విధి విధానాలు లేకుండా జీతాల కోత దుర్మార్గం

**మక్తల్ టౌన్, మే 31 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఉద్యోగుల జీతాల నుండి ఎటువంటి విధి విధానాలు లేకుండా కోతలు విధించడాన్ని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నారాయణపేట జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. శనివారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పలు ఆరోపణలు చేశారు. జూన్ 2న అందజేస్తామని ప్రభుత్వం చెప్పిన ఆరోగ్య కార్డుల కోసం, మే నెల జీతం నుండి 1.5 శాతం ప్రీమియం పేరుతో కోతలు విధించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు.ఈ నిర్ణయాన్ని డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లకు తెలియకుండా, ఉద్యోగులతో ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకుందని ఆరోపించారు. విధి విధానాలు రూపొందించకుండా జీతాల నుండి డబ్బులు కట్ చేయడం అన్యాయమని తెలిపారు. ఈ అంశంపై తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తక్షణ కార్యాచరణకు సిద్ధమవుతోందని జిల్లా నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరిని వెంటనే సవరించుకోవాలని, లేకుంటే ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

## ఈహెచ్‌ఎస్ నిర్బంధ డిడక్షన్ వెంటనే ఉపసంహరించాలి

### పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేందర్ సాగర్

**మహబూబ్‌నగర్, మే 31 ప్రభాతవార్త :** ఉద్యోగుల ఆమోదం లేకుండా ఏ విధమైన విధివిధానాలు ప్రకటించకుండా కనీసం ఏ హాస్పిటల్ లలో ఈ కార్డులు చెల్లుతాయో కూడా తెలియకుండా ఏదీ చెప్పకుండా దొంగ చాటుగా డబ్బులు డిడక్షన్ చేయడాన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం కట్ చేసిన పైసలు ఎక్కడికి వెళ్లాయి ఎవరి అకౌంట్లో ఉన్నాయో తెల్వదన్నారు. దీనికి ఏమైనా ట్రస్ట్ ఉందా ప్రస్తుతానికి లేదు కదా.. ఈ డబ్బులను ప్రభుత్వ అవసరాలకు వాడుతారు వీటికి బాధ్యత ఎవరు వహించాలి లాంటి అనేక ప్రశ్నలు ఎన్నో ఎదురవుతాయని, కావున వెంటనే మన నిరసనలను రాష్ట్ర అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసి ఉపాధ్యాయులకు లాభం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్బంధ డిడక్షన్ లను రద్దు పరచాలని బాలానగర్ మండలశాఖ పక్షాన కోరారు. లేనిచో క్షేత్రస్థాయిలో తీవ్ర నిరసనలు ఎదురవుతాయన్నారు. జూన్ నెల జీతం జూలైలో డిటెక్ట్ అవుతాయని చెప్పినానము కానీ డిడిఓ లకు తెలవకుండా డిడక్ట్ చేయడం జరిగిందన్నారు. ఆర్థిక శాఖ అధికారులు వెంటనే ఉపసహరించుకోవాలని పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్ కోరారు.


## కర్రోళ్ల భాస్కర్‌కు డాక్టరేట్..

### డాక్టరేట్ ప్రధానం చేసిన ఢిల్లీలోని సెడ రూప్స్ యూనివర్సిటీ


డాక్టరేట్ అందుకుంటున్న కర్రోళ్ల భాస్కర్

**గోపాల్ పేట, మే 31 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా గోపాల్ పేట్ గ్రామానికి చెందిన కర్రోళ్ల భాస్కర్ శనివారం ఢిల్లీలోని సెడ రూప్స్ యూనివర్సిటీ వారు కర్రోళ్ల భాస్కర్ చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకు డాక్టరేట్ ప్రధానం చేశారు. గత కొన్ని సంవత్సరాల నుండి తను పుట్టిన సొంత గ్రామమైన గోపాలపేటకు ఎన్నో రకమైన సేవలందిస్తూ, ప్రతి ఒక్క కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తూ, కరోనా సమయంలో కూలి పని చేసే వారి నుండి ప్రభుత్వ అధికారుల వరకు వారి ఆకలి తీర్చి,తన గ్రామ అభివృద్ధే లక్ష్యంగా దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళుతూ,పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తూ,యువతకు క్రీడల్లో గానీ సామాజిక కార్యక్రమాల్లో తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఇలా ఇంకా ఎన్నో సోషల్ సర్వీసులు చేస్తున్న మన ఊరి ముద్దు బిడ్డ శ్రీ“ కర్రోళ్ళ భాస్కర్ కి నేడు గౌరవ డాక్టరేట్ తీసుకోవడం చాలా గర్వించదగ్గ విషయం.మీరు ఇంకా ఇలాంటి సోషల్ సర్వీసులు ఎన్నో చేసి అత్యున్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.

## దామరగిద్ద నూతన ఎస్‌హెచ్‌ఓగా ఎస్సై నరేష్



బాధ్యతలు స్వీకరించిన ఎస్సై నరేష్

**దామరగిద్ద, మే 31ప్రభాతవార్త:** దామరగిద్ద పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ఎస్సై నరేష్ ఆదివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ)లో ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై దామరగిద్దకు వచ్చారు. కాగా, ఇక్కడ ఎస్సైగా పనిచేసిన పి. రాజు మక్తల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై నరేష్ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ డా. వినీత్ ఆదేశాల మేరకు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణ, మత్తు పదార్థాల నిర్మూలన, ట్రాఫిక్ నియమాల అమలు, గ్రామాల్లో నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.పోలీస్‌ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ, సత్వర సేవలు అందించే దిశగా పనిచేస్తామని ఎస్సై నరేష్ తెలిపారు.ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన పిఎం శ్రీ ఉప్పునుంతల విద్యార్థిని


నడిగడ్డ కీర్తి

**ఉప్పునుంతల,మే31 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల పియంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థిని నడిగడ్డ కీర్తి అత్యంత ప్రతిష్టాత్మకమైన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ) బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి ఎంపికైనట్లు పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజన్న ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.దీంతో పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.2026,27 విద్యా సంవత్సరానికి గాను విడుదలైన ఎంపికల జాబితాలో నడిగడ్డ కీర్తి స్థానం దక్కించుకుని ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బి.టెక్ కోర్సులో సీటు సాధించింది.గ్రామీణ ప్రాంతానికి చెందిన సాధారణ కుటుంబంలో జన్మించిన కీర్తి చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ ఈవిజయాన్ని అందుకుంది. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యనభ్యసిస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆమె ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి విద్యార్థిని కీర్తిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల కృషి ఫలితంగానే ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో శ్రమిస్తే మరెన్నో విజయాలు సాధించగలరని సూచించారు. కీర్తి సాధించిన విజయం పట్ల స్థానిక గ్రామ సర్పంచు చింతగాళ్ల శ్రీనివాసులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కట్ట అనంతరెడ్డి, ఏపీసీ చైర్మన్ నర్మద, పాఠశాల ఉపాధ్యాయులు నీలం శ్రీధర్, పోకల సతీష్, శ్యాంసుందర్ గౌడ్, అజ్మతుల్లా, చంద్రశేఖర్, శ్రీనివా సులు, మల్లారెడ్డి, లక్ష్మణ్, గోపి, కల్పన, శ్యామల గౌరి, బిల్కిస్, కవిత, వీరోజు రాజు, రాజవర్ధన్ రెడ్డి తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

## జూన్ 2 నుంచి డీఈఈసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

### డైట్ ప్రిన్సిపల్ డా.మేరాజ్ ఉల్లా ఖాన్


డైట్ ప్రిన్సిపల్ డా. మేరాజ్ ఉల్లా ఖాన్

**మహబూబ్‌నగర్, మే 31 ప్రభాతవార్త :** జూన్ 2 నుంచి డీఈఈసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ ను ప్రారంభిస్తున్నట్లు మహబూబ్‌నగర్ డైట్ కళాశాల ప్రిన్సిపల్ డా. మేరాజ్ ఉల్లా ఖాన్ ప్రకటనలు తెలిపారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన టీజీ డీఈఈసెట్ 2026 ఫలితాలు విడుదలయ్యాయి. అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను ఉంచినట్లు తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో టీజీ డీఈఈసెట్ 2026 ద్వారా డిఈఎల్ఈడి మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థులకు జూన్ 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు సర్టిఫికెట్ ధ్రువీకరణ ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ర్యాంకర్ల వారీగా నిర్ణీత తేదీలలో విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ డా. మేరాజ్ ఉల్లా ఖాన్ తెలిపారు. ఈ ధ్రువీకరణ ప్రక్రియ మొదటి సంవత్సరం తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియం అడ్మిషన్ల కొరకు ఒరిజినల్ సర్టిఫికేట్ల పరిశీలన కింద తెలిపిన తేదీలలో జరుగుతుంది. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు టీజీ డీఈఈసెట్ వెబ్సైట్ ను సందర్శించవచ్చు అని తెలిపారు.తీసుకురావాల్సిన పత్రాలు...ఒరిజినల్ / జిరాక్స్ సెట్లు...విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాటు వాటి జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా వెంట తీసుకురావాలి.డీఈఈసీఈటీ ర్యాంక్ కార్డ్, హాల్ టికెట్, ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ మార్కుల మెమోలు, 4వ తరగతి నుండి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికేట్లు కుల ధృవీకరణ పత్రం (క్యాస్ట్ సర్టిఫికెట్ ఎస్సీ అభ్యర్థులకు కేటగిరీ వివరాలతో కూడినది)ఆదాయ ధృవీకరణ పత్రం, (ఇన్కమ్ సర్టిఫికెట్) టీసీ (ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్) ప్రత్యేక కోటా పత్రాలు ఎన్.సి.సి, స్పోర్ట్స్, పీ హెచ్ ధ్రువపత్రాలు వర్తించే వారికి. సర్టిఫికేట్ వెరిఫికేషన్ షెడ్యూల్ ...తేదీ02.06.20261వ రోజు 01నుండి 600 వరకు,03.06.2026 2వ రోజు 601 నుండి 1200 వరకు04.06.2026 3వ రోజు1201 నుండి 1800 వరకు, 05.06.20264వ రోజు1801 నుండి 2383 వరకు ధ్రువీపత్రాల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 9949993714 సంప్రదించాలని సూచించారు.

## అన్ని దానాల కన్నా.. అన్నదానం మిన్న..


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

**మక్తల్,మే 31 ప్రభాతవార్త:** అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అన్నట్లు మక్తల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అధిక జ్యేష్ఠ మాస పౌర్ణమి సందర్భంగా మక్తల్ పెద్ద చెరువు కట్ట వద్ద గల ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర భక్తులకు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.శ్రీకృష్ణ ఆటోమోటివ్స్ సోనాలిక ట్రాక్టర్ డీలర్ నారాయణపేట వాసవి ఆటోమొబైల్ మక్తల్ యాజమాన్యం అశోక్ రెడ్డి, శ్రీకాంత్ దాతృత్వంతో, కీ.శే.బిలకంటి విజయ గౌరీ, వారి భర్త బిలకంటి రాజేశ్వరయ్య ఆశీస్సులతో బిలకంటి సృజన రామకృష్ణ సహకారంతో సుమారు 500 మందికి అన్నదానం చేశారు.ఈ సందర్భంగా ఆలయ పూజారి అంబరీష్ మాట్లాడుతూ అధికమాసంలో దానాలు చేయడం వల్ల దాతలకు, సేవకర్తలకు రెట్టింపు పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయని, అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని తెలిపారు. ప్రతి పౌర్ణమి నాడు మధ్యాహ్నం దాతల సహకారంతో ఇక్కడ అన్నదానం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు, చుట్టుపక్కల కాలనీవాసులు, రోడ్డు మార్గంలో వెళ్లే భక్తులు, నిత్య సేవాకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అంజన్ ప్రసాద్, దేవరింటి నరసింహారెడ్డి, డి. సురేందర్, రాజు, రవి, కమిటీ యువకులు, వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజ్, వాసవి క్లబ్ అధ్యక్షులు మేడిశెట్టి హరికృష్ణ, సూర్య ఆంజనేయులు, జయనంద్, కావలి శ్రీహరి, మామిళ్ల బుగ్గప్ప, గోపి, ఎం. కిరణ్, మెకానిక్ కాంతు, శ్రీనివాస్, భక్తులు, మహిళలు, పురుషులు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా స్థాయి ప్రశిక్షణ శిబిరం నిర్వహణ


సమావేశంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**వనపర్తి, మే 31, ప్రభాతవార్త:** బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అధ్యక్షతన జిల్లా స్థాయి ప్రశిక్షణ సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వనపర్తి జిల్లా ప్రశిక్షణ ప్రభారీ గిరమోని శ్రీనివాసులు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఏప్రిల్ 15వ తేదీ నుండి మే 15వ తేదీ వరకు వనపర్తి జిల్లాలోని అన్ని మండలాలలో విజయవంతంగా మండల ప్రశిక్షణ శిబిరాలు నిర్వహించడం జరిగిందని మే 25వ తేదీ నుండి జూన్ చివరి వరకు జిల్లా స్థాయి రాష్ట్ర స్థాయి నాయకులకు మూడు రోజులపాటు ప్రతి జిల్లాలో ప్రశిక్షణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా వనపర్తి జిల్లాలో జూన్ 5, 6, 7 తేదీలలో జిల్లా కేంద్రం నాగవరంలోని సూర్యచంద్ర ప్యాలెస్ స్కూల్లో పెద్ద ఎత్తున జిల్లాస్థాయి ప్రశిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయి ప్రశిక్షణ శిబిరంలో జిల్లాలోని 250 మంది జిల్లా రాష్ట్ర స్థాయి నాయకులతో నిర్వహించే శిబిరంలో మూడు రోజుల పాటు వివిధ కాలాంశాలపై 13 సెషన్ లు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్క సెషన్ కు బిజెపి రాష్ట్రస్థాయి నాయకులు, శాసనసభ్యులు,పార్లమెంటు సభ్యులు మరియు ఎమ్మెల్సీలు ప్రధాన వక్తలుగా హాజరుకానున్నారని మొదటిరోజు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావు ప్రశిక్షణ శిబిరాన్ని ప్రారంభించి జిల్లా నాయకులకు మార్గ నిర్దేశం చేయనున్నారని ముగింపు సమావేశానికి బిజెపి జాతీయస్థాయి నాయకులు హాజరుకానున్నారని తెలియజేశారు. సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ, జిల్లా ప్రశిక్షణ ప్రభారీ గిరమోని శ్రీనివాసులు, బిజెపి రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, సబిరెడ్డి వెంకట్ రెడ్డి, మున్నూరు రవీందర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెంటపల్లి పురుషోత్తం రెడ్డి, రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, కేతూరి బుడ్డన్న, ఓబీసీ మోర్చా మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్, వారణాసి కల్పన, జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ క్లబ్‌కు నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా బిక్షపతి


నూతన కార్యవర్గం ఎన్నిక

**అచ్చంపేట,మే,31 ప్రభాతవార్త:** అచ్చంపేట పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఎన్నికలు ఆదివారం ఉత్సాహభరితంగా జరిగాయి. పబ్లిక్ క్లబ్ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.ఎన్నికలఫలితాల్లో అధ్యక్షుడిగా అంగిరేకుల బిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా కన్నోజ్ మనోహర్‌ప్రసాద్ (మన్నుపటేల్), కోశాధికారిగా పోకల ప్రవీణ్ విజయం సాధించారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కందికొండ శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా ఎండి ఫహీం ఎన్నికయ్యారు. మొత్తం 236 మంది సభ్యులకు గాను 217 మంది సభ్యులు ఓటుహక్కును వినియోగించుకోవడం విశేషం. సభ్యుల మద్దతుతో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన నూతన కార్యవర్గ సభ్యులకు క్లబ్ సభ్యులు,పట్టణప్రముఖులు అభినందనలు తెలిపారు.ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైనఅధ్యక్షులు అంగిరేకుల బిక్షపతి మాట్లాడుతూ క్లబ్‌అభివృద్ధికి కృషిచేస్తామని,సభ్యులందరినీ కలుపుకొని పారదర్శకంగా వ్యవహరిస్తామని తెలిపారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడినట్లు ఎన్నికల నిర్వాహకులు వెల్లడించారు.

## పదవీ విరమణ ఉద్యోగానికి మాత్రమే

### డీసీసీ చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి


సుబ్బరాజు కుటుంబాన్ని సన్మానిస్తున్న శివసేన రెడ్డి, తూడి మెగా రెడ్డి

**వనపర్తి,మే31, ప్రభాతవార్త:** ప్రజా సేవలో పరమావధిగా భావిస్తూ క్రమశిక్షణను జీవిత సూత్రంగా భావించి ఎన్నో ఏళ్ల పాటు ఉద్యోగంలో ఉంటూ విశిష్ట సేవలు అందించిన ఆర్టీసీ ఉద్యోగులు, పోలీస్ శాఖలో పని చేసిన సుబ్బరాజులను ఆయన అభినందించారు. విరమణ విశ్రాంతి తీసుకోవడం, వారి కుటుంబంతో శేష జీవితాన్ని పంచుకోవడం జరుగుతుంది కానీ ప్రతి ఒక్కరూ విరమణ తర్వాత సేవా దృక్పథంతో ప్రతి ఒక్కరికి తమ వంతు బాధ్యతగా సేవ చేస్తే జీవితానికి స్వార్థకత ఉంటుందని పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగ సంఘం నాయకులు, పోలీస్ శాఖ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు...


పల్లె దవఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెగారెడ్డి, శివసేనారెడ్డి

**వనపర్తి, మే 31, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమేరేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు.ఆదివారం వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి,రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డిలు ప్రారంభించారు. పేద,మధ్య తరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, “ఆరోగ్యమే మహాభాగ్యం“ ఆ భాగ్యాన్ని ప్రత్యేక గ్రామానికి చేరవేసే వేదిక పల్లె దవకానని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన గ్రామ నిర్మాణానికి పల్లెదగుతున్న ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం గ్రామంలోని కొనుగోలు చేసిన వడ్లను భద్రపరచందుకు రూ.30 లక్షల వ్యయంతో నూతన స్టోరేజ్ గోదాం నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. రైతులకు ఎక్కడ ఇబ్బంది లేకుండా,రైతు సంక్షేమంకోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.


నూతన స్టోరేజ్ గోదాం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

## బాసర విద్యాలయానికి ఆత్మకూరు విద్యార్థి ఎంపిక



**ఆత్మకూర్ మే 31, ప్రభాతవార్త;** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలోని శ్రీవాణి పాఠశాలకు చెందిన విద్యార్థిని దీప్తి బాసరలోని ట్రిబుల్ ఐటీ విద్యాలయానికి ఎంపికైనట్లుగా పాఠశాల ప్రిన్సిపల్ లతా గంగాధర్ విలేకర్లకు తెలిపారు. 2025/ 26 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ తరగతి పరీక్ష ల్లో 579 మార్కులు సాధించి మండల టాపరుగా నిలిచినటు వంటి దీప్తి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించినటువంటి రాజీవ్ గాంధీ టెక్నాలజీ బాసర విద్యాలయానికి ఎంపిక కావడం పట్ల ఆత్మకూర్‌పట్టణానికి గర్వకారణంగా నిలిచిందని ఆయన తెలిపారు. ప్రతిసంవత్సరం తమపాఠశాల నుండి బాసర విద్యాలయానికి విద్యార్థులు ఎంపిక అవుతుండడంపట్ల పాఠశాల అకాడమిక్ అడ్వైజర్ టీజేవిశ్వేశ్వర్ ప్రత్యేకంగా విద్యార్థిని అభినందించారు.

## కోయిలకొండ ఎస్సైగా ఏ.నాగరాజు


ఏ. నాగరాజు

**కోయిలకొండ మే 31, ప్రభాతవార్త;** కోయిలకొండ మండల ఎస్సైగా ఏ. నాగరాజు ఆదివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈయన మహబూబ్ నగర్ విఆర్ నుంచి కోయిలకొండకు బదిలీపై వచ్చారు. కోయిలకొండలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై తిరుపాజి మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు.ఈసందర్భంగా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఎస్సై నాగరాజు మాట్లాడుతూ కోయిలకొండ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## కృష్ణ మండలంలో మూడు ప్రీ ప్రైమరీ స్కూళ్లకు అనుమతి

### మండల విద్యాధికారి నిజాముద్దీన్




**కృష్ణ,మే31 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే లక్ష్యంతో తీసుకువచ్చిన ప్రీ ప్రైమరీ పాఠశాలలను కృష్ణ మండలంలో ముడుమల్, హిందూపూర్,కున్సీ గ్రామాలకు మంజూరైనట్లు పేర్కొన్నారు. జూన్ 12 నుండి 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అడ్మిషన్లు కల్పించి ఆట పాటలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు ప్రభుత్వ ఆదేశానుసారం తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు ప్రీ ప్రైమరీ తరగతులను సద్వినియోగం చేసుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

## టిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ


టిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

**జడ్చర్ల,మే31,ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణంలో జడ్చర్ల నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ జెండాను జడ్చర్ల నియోజకవర్గం ఇంచార్జ్‌లు బిర్లా ఎల్లయ్య యాదవ్ ,శాగంటి మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహబూబ్ నగర్ జిల్లా జెండా పండుగ ఇన్చార్జి మెట్టుకాడి ప్రభాకర్, జడ్చర్ల నియోజకవర్గ పార్టీ అబ్జర్వర్ ప్రవీణ్ ముదిరాజ్ హాజరయ్యారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్‌నాయకులు ధీరజ్ ముదిరాజ్,భగీరథ ముదిరాజు, కృష్ణారెడ్డి, మల్లేష్, జగదీశ్వర్ ముదిరాజ్, మమ్మద్ ఉస్మాన్, మహమ్మద్ అజి, శ్రీశైలం గౌడ్, వినయ్ కుమార్, భాగ్యరాజ్, జంగం శివకుమార్, శ్రీకాంత్ రెడ్డి, నాని, చింటూ, బాల్నగర్ మండల నాయకులు సుమన్ నాయక్, రాజాపూర్ మండల నాయకుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు పడి గడ్డి కట్టలు దగ్ధం



**ఖిల్లా గణపురం మే 31, ప్రభాతవార్త;** ప్రమాదవశాత్తు వరి గడ్డి కట్టలు అంటుకొని దగ్ధమైన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం మల్కి మియాన్ పల్లి గ్రామ శివారు పిల్లి వాగు సమీపంలో మధ్యాహ్నం గడ్డి కట్టలపై నిప్పు రవ్వలు పడటంతో 300 గడ్డి కట్టలు అగ్నికి ఆహుతి అయినట్లు రైతు బుచ్చిరెడ్డి తెలిపారు. పాడి గేదెల కోసం గడ్డి కట్టలను మోపుగా పెట్టి కవర్లు కప్పామని దురదృష్టవశాత్తు నిప్పురవ్వలు పడటంతో గడ్డి కట్టలు పూర్తిగా దగ్ధమైనట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 30 వేల రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని జిల్లా అధికారులు స్పందించి ఆదుకోవాలని తెలిపారు.

## అగ్నివీర్ జవాన్లుగా ఎంపికైన గుడేబల్లూర్ యువకులు


ఎంపికైన యువకులు

**కృష్ణ,మే 31 ప్రభాతవార్త :** కృష్ణ మండలం గుడేబల్లూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అగ్నివీర్ జవాన్లుగా ఎంపికయ్యారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన (అగ్నివీర్) జవాన్ల ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్‌లో తల్లి తండ్రులు పల్లె వెంకటేష్ పద్మల కుమారుడు రవి అగ్నివీర్ జిడి విభాగంలో, తల్లి దండ్రులు మహాదేవ్ నింగమ్మల కుమారుడు పూజారి మహేశ్ (కుర్వ) అగ్నివీర్ టెక్నికల్ ట్రేడ్ విభాగంలో మెడికల్ పరీక్ష పోటీలో సత్తా చాటి భారత సైన్యంలో అగ్నివీర్ జవాన్లుగా ఎంపికయ్యారు. ఎంపికైన యువకులకు గ్రామస్థుల నుండి పెద్ద ఎత్తున అభినందనలు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.

# డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి..

- ఏండ్లు గడుస్తున్నా పరిష్కారం శూన్యం
- వర్షాకాలం వచ్చిందంటే భయాందోళన
- 23వ వార్డు ప్రజల అవస్థలు

**జడ్చర్ల మే 31 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పద్మావతి కాలనీ 23వ వార్డులో డ్రైనేజీ సమస్యలతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సంవత్సరాలు గడుస్తున్న సమస్యకు పరిష్కారం దొరకకపోవడంతో ఇక ఆందోళన బాట పట్టారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు భయాందోళన చెందుతున్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో పద్మావతి కాలనీ లో డ్రైనేజీ సమస్యతో అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే కాలనీలో ఉన్న చెరువు నిండి అలుగునీరు సైతం డ్రైనేజీ కాలువలకు చేరడంతో ఉప్పొంగి ఇండ్లలోకి నీరు చేరే పరిస్థితి ఏర్పడుతుంది. గత కొన్నేళ్లుగా ఇదే తంతు కొనసాగుతున్నది. గడిచిన రెండు మూడేళ్లలో చెరువు నీరు ఉప్పొంగి ప్రవహించి డ్రైనేజీ కాలువలను నిండి రోడ్లపైకి కూడా రావడంతో కాలనీ మొత్తం చెరువులను తలపించింది. చెరువులో ఉన్న చేపలు సైతం రోడ్లపైకి డ్రైనేజీ కాలువల్లోకి చేరడంతో కాలనీవాసులంతా చేపలు కూడా పట్టి తమ నిరసనను తెలిపారు. గత నెల రోజుల కిందట డ్రైనేజీ సమస్యతో పాటు స్ట్రామ్ వాటర్ కాలువను కూడా నిర్మించేందుకు





ఇళ్ల మధ్య నిలిచిన మురికినీరు

ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ఈ క్రమంలో పనులు కొనసాగుతున్నాయి. అయితే వర్షాకాలం మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో అసలు ఈ కాలువ పనులు పూర్తయితాయా.. ఈ ఏడాది అయినా వర్షాకాలంలో ఇబ్బందులు తొలగుతాయా అన్న సందేహాలు కాలనీవాసుల్లో మొదలయ్యాయి. నెల రోజుల కిందట పనులు ప్రారంభమైనా ఇంకా నత్తనడకనే కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా గత వారం రోజుల్లో కురిసిన రెండు వర్షాలకు కాలనీలో డ్రైనేజీ నిండి మురుగునీరు అంతా రోడ్లపైకి చేరడంతో ఇళ్ల మధ్య కంపు కొడుతున్నది. ఇక చేసేదేమీ లేక ప్రజలు అలాగే తమ ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ కు వినతి.. జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్‌కు గత రెండు రోజుల కిందట పద్మావతి కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. కాలనీలో ఇండ్ల మధ్య నిలిచిన ములుగు నీరు వద్ద ఫోటోలు దిగి, తమ దుస్థితిని తెలిపారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని లేనియెడల మున్సిపల్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని చెబుతున్నారు.

## 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు

**ఉప్పునుంతల, మే 31 ప్రభాతవార్త:** రైతుల సాగు ఖర్చులను తగ్గించడంతో పాటు భూసారాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులను అందుబాటులో ఉన్నట్లు ఉప్పునుంతల మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ తెలిపారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పునుంతల సింగిల్ విండో లో 108 బ్యాగులు (ప్రతి బ్యాగు 30 కిలోలు), ఆగ్రో రైతు సేవా కేంద్రంలో మరో 108 బ్యాగులు (ప్రతిబ్యాగు30 కిలోలు) అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఒక బ్యాగు ధర రూ.4,905 కాగా, ప్రభుత్వం అందిస్తున్న 50శాతం సబ్సిడీ అందిస్తుందనీ రైతులు కేవలం రూ.2,453 మాత్రమే చెల్లించి పొందవచ్చని వెల్లడించారు.పచ్చిరొట్ట ఎరువుల వినియోగం వల్ల నేల సేంద్రియ పదార్థాల శాతం పెరగడంతో పాటు భూసారం మెరుగు పడుతుందని, పంటలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా అందుతాయని వివరించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంతో పాటుదీర్ఘకాలికంగా భూమి ఆరోగ్యాన్ని కాపాడడంలో పచ్చిరొట్ట ఎరువులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.పచ్చిరొట్ట ఎరువులు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, మొబైల్ ఫోన్ నంబర్‌వివరాలతో సంబంధితకేంద్రాలను సంప్రదించాలని సూచించారు. పరిమిత సంఖ్యలోమాత్రమేఎరువులు అందుబాటులో ఉన్నందున రైతులు త్వరగా నమోదుచేసుకుని ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ రైతులకు సూచించారు.

## నేడు ఉప్పునుంతలలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం

**ఉప్పునుంతల, మే 31 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామంలో సర్పంచ్ తో ఉపసర్పంచ్‌తో పాటు నాయకులు, వార్డు సభ్యులు, యువజన సంఘం సభ్యులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు పేర్కొన్నారు.

## నేడు పేట బంద్‌కు విహెచ్‌పీ పిలుపు

**నారాయణపేట, మే 31 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన 15 ఏళ్ల మైనర్ బాలిక ఆత్మహత్య ఘటనను నిరసిస్తూ జూన్ 1న నారాయణపేట పట్టణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు విశ్వహిందూ పరిషత్ నాయకులు కార్యదర్శి కన్న శివకుమార్, పట్టణ అధ్యక్షుడు మురళి భట్టడ్, బజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షుడు వడ్ల శ్రావణ్ కుమార్, కడుదాస్ ప్రవీణ్ ఈ విషయాన్ని వెల్లడించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులకు కఠిన శిక్షలు విధించాలని పేర్కొన్నారు. అలాగే బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జూన్1న నిర్వహించనున్న బంద్‌కు జిల్లా కేంద్రంలోని వ్యాపార వర్గాలు, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**నారాయణపేట, మే31 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని అప్పంపల్లి గ్రామ పరిధిలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది.స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా, సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ధన్వాడ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా స్థానికులు అనుమానిస్తున్నప్పటికీ, అధికారికంగా ఇంకా గుర్తింపు నిర్ధారణ కాలేదు.మృతుడి వివరాలు, మరణానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

## ప్రధాని మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు



ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బిజెపి నాయకులు

**మదనాపురం, మే31 ప్రభాతవార్త:** ప్రధాని మోడీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని మండల పరిధిలో తిర్మలాయ పల్లి గ్రామంలో మండల మాజీ అధ్యక్షుడు బాబు గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన టీవీలో మన్‌కీ బాత్ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమార్, బీజేపీ నాయకులతో కలిసి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రసంగానికి టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సందేశాన్ని కార్యకర్తలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించే విధంగా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ఎగ్గని నర్సింహులు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మండల నాయకులు డీలర్ శ్రీనివాసులు, అమర్నాథ్ చిట్టి, వెంకటేశ్వరశెట్టి, శ్రీనివాస్‌గౌడ్, బురాన్, భాస్కర్, రాము, ఆంజనేయులు, కృష్ణ, రాఘవేంద్ర, విష్ణు, హరీష్, రవి, చెల్లయ్య, శివసాగర్, వివిధ గ్రామాల బూతు అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్డులు లేవు.. ఒప్పందాలు లేవు.. జీతాల్లో కోతలా?

### ఆర్థిక శాఖ అత్యుత్సాహంపై టిటియు జిల్లా శాఖ తీవ్ర ఆగ్రహం

**మహబూబ్‌నగర్, మే 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆరోగ్య భద్రత విషయంలో ఆర్థిక శాఖ వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉందని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం మహబూబ్‌నగర్‌జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తుంది. ఉద్యోగులకు కనీసం చేతికి ఆరోగ్య కార్డులు ఇవ్వకుండా, పథకానికి సంబంధించిన ఎలాంటి విధివిధానాలు ఖరారు చేయకుండానే మే నెల జీతం నుండి ఏకపక్షంగా 1.5 శాతం ప్రీమియం చందాను కట్ చేయడం దుర్మార్గమని టిటియు జిల్లా అధ్యక్షులు జురు నారాయణ యాదవ్, ప్రధాన కార్యదర్శి గుడిసే యాదయ్య మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసలు ఆసుపత్రులతో ప్రభుత్వానికి ఎలాంటి ఒప్పందాలు జరగలేదని, వైద్య సేవలకు సంబంధించిన ప్యాకేజీ రేట్లు కూడా నిర్ణయించలేదని గుర్తు చేశారు. కనీస సదుపాయం కల్పించకుండానే వసూళ్లకు తెరలేపడం ఉద్యోగులను వంచించడమేనన్నారు. దీనికితోడు ఆర్థికశాఖ చూపిస్తున్న అత్యుత్సాహం వల్ల ఒకే కుటుంబంలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే, వారిద్దరి జీతాల నుండి విడివిడిగా 1.5 చొప్పున ప్రీమియంకట్ చేయడం ఉద్యోగ దంపతులపై మోపిన అదనపు ఆర్థిక భారమని ధ్వజమెత్తారు. ఒకే కుటుంబానికి వైద్యం అందించే క్రమంలో ఇద్దరి నుంచి చందాలు వసూలు చేయడం ఏ చట్టంలో ఉందో ఆర్థిక శాఖ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కార్డులు లేవు, హాస్పిటల్స్ తో ఒప్పందము లేదు కానీ జీతాల కోత మాత్రం పక్కాగా అమలు చేయడం ఆర్థిక శాఖ నిరంకుశత్వానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ అనాలోచిత ప్రీమియం కోతలను నిలిపి వేయాలని,స్పష్టమైన విధివిధానాలు ప్రకటించి, ఆసుపత్రులతో ఒప్పందాలు పూర్తయ్యాకే హెల్త్ కార్డుల ప్రక్రియను ప్రారంభించాలని టిటియు డిమాండ్ చేస్తుందన్నారు. భార్యాభర్తలిద్దరి నుంచి చేస్తున్న డబుల్ రికవరీని వెనక్కి తీసుకోకపోతే ఉపాధ్యాయ లోకం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## మైనర్ బాలిక మృతి కేసులో నిందితుడు అరెస్ట్

**నారాయణపేట, మే31 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్న మైనర్ బాలిక మృతి ఘటనకు సంబంధించి నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శివశంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, జిల్లా కేంద్రానికి చెందిన ఓ మైనర్ బాలికను ఫైజల్ అనే వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి తనకు అనుకూలంగా ప్రవర్తింపజేసుకున్నాడని, అనంతరం పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన బాలిక తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు తెలిపారు.కేసును అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని దర్యాప్తు జరిపిన పోలీసులు నిందితుడు ఫైజల్‌ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో సమగ్ర విచారణ కొనసాగుతోందని చెప్పారు. మైనర్లపై జరిగే నేరాల విషయంలో జిల్లా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని, బాధితులకు న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని, ఏవైనా అనుమానాస్పద సంఘటనలు, వేధింపుల గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు పూర్తయిన అనంతరం వెల్లడిస్తామని సీఐ శివశంకర్ తెలిపారు.

## ఇంటర్ విద్యార్థి తేజశ్రీని సన్మానించిన ఎమ్మెల్యే



విద్యార్థిని తేజశ్రీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మెగారెడ్డి

**గోపాల్‌పేట, మే31 ప్రభాతవార్త:** ఏదుల మండలం చీర్కపల్లి గ్రామానికి చెందిన ఎలుక మల్లయ్య యాదవ్ కుమార్తె తేజశ్రీని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శాలువాలతో సన్మానించారు.ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గాను 466 మార్కులు తెచ్చుకొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని ఎమ్మెల్యే ప్రశంసించారు.రెండో సంవత్సరం చదివేందుకు విద్యార్థికి కావలసిన ఆర్థికపరమైన సహాయ సహకారాలు అందజేస్తానని ఉత్తమ విద్యనభ్యసించాలని ఇంజనీరింగ్ లోను తను అండగా ఉంటానని ఎమ్మెల్యే విద్యార్థినికి భరోసా కల్పించారు.కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

- నియోజకవర్గంలో పలు కుటుంబాలను పరామర్శించిన బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి



బాధిత కుటుంబాలను పరామర్శించిన బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, మే 31 ప్రభాతవార్త:** అనారోగ్య పరిస్థితులు, వివిధ ప్రమాదాల్లో మరణించిన బాధిత కుటుంబాల సభ్యులను మాజీ మంత్రి బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డా. సి. లక్ష్మారెడ్డి పరామర్శించారు. పెద్ద ఆదిరాల గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుడు లింగయ్య, నాగేష్, జడ్చర్ల గ్రామానికి చెందిన నీరడి సురేందర్, గొల్లపల్లి వెంకటయ్య ఇటీవలే తనువు చాలించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి బాధిత కుటుంబాల సభ్యులను పరామర్శించి ఓదార్చారు. గత నాలుగు ఐదు రోజులు విదేశీ పర్యటనలో ఉండడంతో శనివారం స్వదేశానికి చేరుకున్న మాజీ మంత్రి ఆదివారం జడ్చర్ల నియోజకవర్గం లో పర్యటించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం చెప్పారు. ఆయన వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, ఇంతియాజ్ ఖాన్, పిట్టల మురళి, ప్రనిల్ చందర్, కరాటే శీను తదితరులు ఉన్నారు.



నీరడీ సురేందర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

## ప్రకృతి ప్రేమికుడు రాసమొళ్ల చంద్రయ్య

- ప్రముఖ సాహితీవేత్త, న్యాయవాది బెక్కెం జనార్దన్
- నల్లమల మొగ్గలు, రాసమొళ్ల రత్నావళి పుస్తకాల ఆవిష్కరణ



నల్లమల మొగ్గలు, రాసమొళ్ల రత్నావళి పుస్తకాల ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

**లింగాల,మే 31 ప్రభాతవార్త:** నల్లమల ప్రకృతి ప్రేమికుడు కవి రాసమొళ్లచంద్రయ్య అని ప్రముఖ న్యాయవాది సాహితివెత్త బెక్కెం జనార్దన్ అన్నారు.ఆదివారం లింగాల మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో రాసమొళ్ల చంద్రయ్య రచించిన నల్లమల మొగ్గలు, రాసమొళ్ల రత్నావళి మణిపూసలు పుస్తకాలను ప్రముఖ సాహితీ వేత్త, బెక్కెం జనార్దన్ కవి ఇంటిదగ్గర అప్పాయిపల్లి గ్రామంలో ఆవిష్కరించారు.ఈ సభకు నెల పొడుపు సాహిత్యవేదిక ప్రదాన కార్యదర్శి వహీద్ ఖాన్ సభాధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై బెక్కెం జనార్దన్ మాట్లాడుతూ అప్పాయిపల్లి గ్రామంలో ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన ధిక్కార స్వరంలో బాలుడుగా ఉన్న రాసమొళ్ల చంద్రయ్య పాల్గొన్నాడని ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రజలకోసం సమాజ మార్పుకు మొగ్గలు మణి పూసల కవిత్వం ద్వారా వెలుగెత్తి చాటుతున్నాడని ఆ అక్షరాలు ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్నాయని చంద్రయ్యని కొనియాడారు.ప్రశ్నించే తత్వం ఎల్లప్పుడూ సమాజంలో ఉంటుందని ఆ ప్రశ్ననే కవిత్వంలో కనపరుస్తూ చంద్రయ్య వినిపిస్తున్నాడని చెప్పారు. చంద్రయ్య తనకు ఈ కవిత్వం పుస్తకాలను అంకితం ఇవ్వడం గొప్పగా భావిస్తున్నానని రాబోయే కాలంలో మరిన్ని సమాజమార్పు కోసం తన కవిత్వం ద్వారా గళమెత్తాలని కోరారు. అనంతరం కవి బోలయాదయ్య, కవి ఆశీర్వాదం నల్లమల మొగ్గలు రాసమొళ్ల రత్నావళి కవిత్వాలను సమీక్షించి మాట్లాడుతూ అణగారిన వర్గాలకు అక్షరాన్నందించిన సావిత్రీ బాయి ఫూలే శ్రమ పోరాట తాత్వికతను నల్లమల సౌందర్యం,దేశభక్తులు, రైతులు చెట్లు, మహిళలు, పిల్లలు చెరువులు నదులు సైనికులు ,అమ్మానాయన ,స్వామి వివేకానంద మొదలగు సామాజిక అంశాలపై కవిత్వం రాయడం అభినందనీయమని అన్నారు.రాసమొళ్ల చంద్రయ్య దివ్యాంగుడైనా శక్తినంత కూడదీస్కొని సమసమాజ మార్పుకై అక్షరాన్ని సృష్టించడం గొప్పవిషయమని అన్నారు.అప్పాయిపల్లి గ్రామం నుండి దశాబ్దం కాలంగా మొగ్గలు కవిత్వం రాస్తున్న చంద్రయ్య గతంలో నల్లమల ఆరాధ్య దైవం సళేశ్వరం లింగమయ్య పై పాటలను దివ్యాంగుల మణి పూసలు రచించాడు. జీవితంలోని అనేక పార్శాలతో వచ్చిన కవిత్వాన్ని ఆస్వాదిద్దామని నల్లమల అస్తిత్వాన్ని అక్షరీకరించడం గొప్ప విషయమని రాసమొళ్ల చంద్రయ్య అప్పాయిపల్లి వెలుగని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూడవత్ విజయ కృష్ణనాయక్ , భీంపల్లి శ్రీకాంత్, వడిచర్ల సత్యం, వనపట్ల సుబ్బయ్య గంటామనోహర్ రెడ్డి, ఆశీర్వాదం,కందికొండ మోహన్, ఎదిరెపల్లి కాశన్న, కల్వకోల్ మద్దిలేటి, నల్లగొండ శ్రీనివాస్,కేపి.లక్ష్మీనరసింహ్మా,దేవరపాగ కృష్ణయ్య,నిరంజన్ బాలయ్య లింగస్వామి మల్లేష్ బాలమ్మ, కవిత, జ్యోతి పాల్గొన్నారు.

## హెల్త్ కార్డుల పేరుతో జీతాల్లో కోతలు

- సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్‌గౌడ్



పలుస శంకర్ గౌడ్ (ఫైల్)

**వనపర్తి, మే31, ప్రభాతవార్త:** హెల్త్ కార్డులకు సంబంధించిన విధి విధానాలు ప్రకటించకుండా, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా ప్రీమియం వసూలు చేయడం దారుణం. అధికారికంగా కార్డులు జారీ చేయకుండా, పథకంపై పూర్తి సమాచారం ఇవ్వకుండానే జీతాల్లో కోత విధించడం ఉపాధ్యాయులను మోసగించడమేనని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్‌గౌడ్ అన్నారు.ఇప్పటివరకు వరకు వసూలు చేసిన ప్రీమియం మొత్తాన్ని తిరిగి చెల్లించి, కార్డులు జారీ చేసి, విధివిధానాలు స్పష్టం ఉపాధ్యాయ సంఘాల సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీ సుకోవాలని శంకర్ గౌడ్ డిమాండ్ చేసారు. హెల్త్ కార్డుల పేరుతో ఒక్క ఉపాధ్యాయునితో రెండు లేదా మూడు వేల రూపాయలు అనుమతి లేకుండా ప్రీమియం సాకుతో జీతాలలో కోత విధించడం అన్యాయం అన్నారు.ఈ హెల్త్ కార్డు పథకం ఇష్టం లేని వారికి దాని నుండి మినహాయింపు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమ్మతి లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా మే నెల వేతనాల నుండి ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఇహెచ్‌ఎస్) పేరుతో కోతలు విధించడం సరైన విధానం కాదని శంకర్ గౌడ్ ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవసందర్భంగా ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను అమలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో,ఆ పథకం అధికారికంగా ప్రారంభం కాకముందే మే నెల వేతనాల నుండి కోతలు విధించడం అనేక సందేహాలకు తావిస్తోందని వారు పేర్కొన్నారు.ఇప్పటివరకు ఉద్యోగులకు (ఇహెచ్‌ఎస్) కార్డులు జారీ చేయకపోవడం, రాష్ట్రంలో ఏయే ఆసుపత్రులు ఈ పథకంలో భాగస్వాముల య్యాయో లేదో స్పష్టత లేకపోవడం, కార్పొరేట్ ఆసుపత్రుల బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం అధికారిక సమాచారం ఇవ్వక పోవడం, అలాగే పథకానికి సంబంధించిన పూర్తి విధివిధానాలను వెల్లడించకుండానే వేతనాల్లో కోతలు విధించడం ఉద్యోగుల్లోఆందోళన కలిగిస్తున్నదని తెలిపారు.ఉద్యోగుల పెండింగ్ డి.ఏ.లు, పి.ఆర్.సి.అమలు, ఇతరఆర్థిక అంశాల విషయంలో ఆల స్యం చేస్తున్న ప్రభుత్వం,కోతల విషయంలో మాత్రం అత్యంత వేగంగా వ్యవహరించడం విచారకరమని పేర్కొన్నారు. ఉద్యోగుల ఆర్థిక హక్కులను ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకునే ముందు ఉద్యోగ సంఘాలతో చర్చించి, పూర్తి వివరాలను వెల్లడించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై సమగ్ర వివరణ ఇవ్వాలని,ఉద్యోగుల వేతనాలనుండి విధించిన కోతలను పునః సమీక్షించాలని, పూర్తిస్థాయి మార్గదర్శకాలు, పారదర్శక సమాచారాన్ని విడుదల చేయాలని డిమాండ్ చెసారు. జీతం నుండే ప్రీమియం వసూలు చేసేవిధానం మానుకోవాలనిశంకర్‌గౌడ్ సూచించారు. గతంలో ప్రభుత్వ పునశ్చరణ ద్వారా చికిత్స తరువాత 50 నుండి 80 శాతం దాక ఎలాంటి ప్రీమియం లేకుండా డబ్బులు చెల్లించేవారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ ద్వారా ఉపాధ్యాయులూ బీమా చేయించుకున్నారు. టీచర్స్ పర్మిషన్ తీసుకొనిహెల్త్ కార్డులుఇవ్వాలని శంకర్‌గౌడ్ డిమాండ్ చేసారు.

## బోడబండ లింగమయ్యకు ప్రత్యేక పూజలు

**వనపర్తి, మే 31, ప్రభాతవార్త:** ప్రతి ఏడాది మే చివరి వారంలో నిర్వహించే ఈ లింగమయ్య పండుగలో గ్రామానికి చెందిన యాదవులు, ముదిరాజులు పాల్గొని పెద్ద ఎత్తున పండుగ నిర్వహిస్తారని గ్రామ సర్పంచ్ పరుశురాం తెలిపారు.ప్రతి సంవత్సరం ఈ బోడ బండ లింగమయ్యకు ప్రత్యేకపూజలు నిర్వహించడం,గొర్రె పోటీలు మేకపోతులతో స్వామివారికి నైవేద్యం సమర్పించడం పూర్వకాలం నుంచి ఆనవాయితీగా వస్తుందని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి రిజర్వాయర్ వెంటఉన్న రహదారిని ఏర్పాటు చేయిస్తానని చెప్పారు.అదేవిధంగా ఆలయానికి కావలసిన సిసి రహదారిని వచ్చే సంవత్సరం నాటికి నిర్మిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏదుల మండల అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు పర్వతాలు, కేశంపేట సర్పంచ్ సురేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బోడ లింగమయ్యకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

